క్లుప్తంగా

పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్ అందజేస్తున్న డీఎంహెచ్ఓ

నార్కట్‌పల్లి: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు క్యూబ్ రూట్ హైవే ఫౌండేషన్, బ్రాస్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నల్లగొండ డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ రోగులు మందులతోపాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ కళ్యాణచక్రవర్తి, మెడికల్ ఆఫీసర్లు, టీబీ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

వట్టిమర్తిలో టీబీ పరీక్షలు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలో చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వంద రోజుల టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో 219 మందికి టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ ఈసం వెంకటేశం, సీహెచ్ఓ నర్సింగరావు, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది. శివాని, నాగరాణి, విజయ, నరసయ్య పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

మునుగోడు: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులను బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎన్.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ కార్యక్రమం ఉంటుందని, లబ్ధిదారులు హాజరై నూతన రేషన్ కార్డులు తీసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



నందిని (ఫైల్)

మర్రిగూడ: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని గుణగోని నందిని(12) మంగళవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివన్నగూడ గ్రామానికి చెందిన నందిని మర్రిగూడ కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. రెండు వారాల క్రితం అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు హాస్టల్ నుంచి తీసుకెళ్లి చికిత్స అందించారు. ప్లేట్‌లెట్స్ తగ్గడంతో నందిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

టెట్ ఫలితాల్లో 'అవనిగడ్డ' ప్రతిభ

నల్లగొండ: టెట్ ఫలితాల్లో నల్లగొండలోని అవనిగడ్డ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు 90 శాతం అర్హత సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ కేశమోని చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పేపర్–1లో జి.శేఖర్, ఎస్.వీణ 150 మార్కులకు 127 మార్కులు పొంది రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు పొందారన్నారు. 20 మంది 100 మార్కులకు పైగా సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులను ఆయన సన్మానించారు.

27న బోనాల వేడుక

చిట్యాల: శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 27న కనగల్ మండలం దర్వేశిపురంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నల్లగొండ జిల్లా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం తొలి బోనాల జాతర నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి సతీష్, నకిరేకల్ నియోజకవర్గ బోనాల జాతర ఉత్సవ కమిటీ కో కన్వీనర్ తాడూరి చంద్రం తెలిపారు. చిట్యాలలో బోనాల జాతర ప్రచార కరపత్రాలను మంగళవారం వారు విడుదల చేసి మాట్లాడారు.

బ్యాగుల పంపిణీ

కట్టంగూర్ : ఎరసానిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ యువత ఆకిటి వినోద్, నవీన్, మధు, భరత్‌లు తమ మాతృమూర్తి జ్ఞాపకార్థం రూ.20 వేల విలువ చేసే బ్యాగులు, షూ అందజేశారు. హెచ్‌ఎం చింత యాదగిరి ,ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంధ్యారాణి, శంకర్, పరమేశ్ పాల్గొన్నారు.

మునుగోడు: ఇప్పర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు గోలి లింగస్వామి సమకూర్చిన స్కూల్ బ్యాగులు, షూలను మంగళవారం ఎంఈఓ మల్లేషం అందజేశారు. భవనం మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

మర్రిగూడ: శివన్నగూడెం రిజర్వాయర్ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు దోనూరి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం సీపీఎం నాయకులు శివన్నగూడెం రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ ప్రాజెక్టుకు డీపీఆర్ అనుమతులు ఇచ్చి బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో దూడ యాదగిరెడ్డి, ఏర్పుల యాదయ్య, శ్రీనివాస్‌చారి, మల్లెపల్లి లలిత, తుమ్మల నర్సిరెడ్డి, దొంతగాని పెద్దులు, రామలింగచారి, నరసింహ, ఏరుకొండ శ్రీశైలం పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కరువు

- అధ్వానంగా మరుగుదొడ్లు
- విద్యార్థులకు అందని తాగునీరు
- ఎండలోనే మధ్యాహ్నం వంట



మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాల



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

నకిరేకల్ : పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన గదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు మండుటెండలో విద్యార్థులకు వంట చేస్తున్నారు. మరుగుదొడ్లు సరిగ్గా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ నకిరేకల్ మండలంలోని మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి.

మొత్తం 20 మంది విద్యార్థులు

మండలాపురం పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు అందుబాటులో ఉంది. ఒకటో తరగతిలో ముగ్గురు, రెండో తరగతిలో ఐదుగురు, మూడో తరగతిలో నలుగురు, నాలుగో తరగతిలో ఒక్కరు, ఐదో తరగతిలో ఐదుగురు, ఆరో తరగతిలో ఇద్దరు చొప్పున విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 20మంది విద్యార్థులు హెచ్‌ఎం మరో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

ఇంటి నుంచే నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

మండలాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లాల్సి వస్తోంది. పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతుల కోసం ఒక లక్ష రూపాయల నిధులు మంజూరైనప్పటికీ సగం మేర పనులు చేసి వదిలేశారు. విద్యార్థులకు తాగు నీటి వసతి లేదు. మధ్యాహ్న భోజనం కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసినప్పటికీ కోతులు వాటిని ధ్వంసం చేయడంతో షెడ్డు కూలిపోయింది. వంట గది లేక మండు టెండలోనే మధ్యాహ్న భోజనం వంటలు వండుతున్నారు. భోజన సమయంలో విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు ఏర్పాటు చేసిన వాష్ ఏరియా ట్యాప్‌ల నుంచి నీరు రావడంలేదు. ఇంటి వద్ద నుంచే వాటర్ బాటిల్ తెచ్చుకుని విద్యార్థులు దాహం తీర్చుకుంటున్నారు. బాటిల్‌లో మిగిలిన నీటితో చేతులు కడుక్కుంటున్నారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేసేందుకు స్కావెంజర్ లేకపోవడంతో ఆ బాధ్యతలను కూడా మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలే నిర్వహిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వంట గది నిర్మించాలి



"మా పాఠశాలలో వంట గదికోసం రేకుల షెడ్డు నిర్మించినప్పటికీ దానిని కోతులు కూల్చివేశాయి. వంట గది లేక ఎండలోనే పొయ్యిరాళ్లు పెట్టి విద్యార్థులకు వంటలు చేస్తున్నా. వంట గది నిర్మించాలి.

–చింతలపాటి దుర్గమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



"మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మా ఉపాధ్యాయుల సహకారంతో అనేక ప్రయత్నాలు చేస్తున్నాం. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు పని చేయడం లేదు. మంచి నీళ్లు ఉదయం 7 గంటల లోపే వస్తున్నాయి. దీంతో మంచి నీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

–రామకృష్ణ, హెచ్‌ఎం, మండలాపురం

పేదల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాల : రేషన్‌కార్డులు అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి భారం మోపినప్పటికీ.. ఇచ్చిన హామీలకు కట్టుబడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలంలో లబ్ధిదారులకు మంజూరైన 1620 రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మీ, షాదిముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం చిట్యాలలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయలేదని అన్నారు. ప్రజాపాలనలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు దశల వారీగా అర్హులైన పేదలందరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, జడల చినమల్లయ్య, మాజీ ఎంపీటీసీలు ఎద్దులపురి కృష్ణ, వడ్డెపల్లి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, అంతటి వెంకటేష్‌గౌడ్, ఆవుల యాదయ్య, గార్లపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కేతేపల్లి: అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లిలో మంగళవారం లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నందున కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుత్త మంజులమాధవరెడ్డి, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీలు మల్లికార్జునరావు, లక్ష్మమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



నకిరేకల్ : సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

నకిరేకల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ నకిరేకల్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు వంటల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షంగౌడ్, నిమజ్జన భిక్షమయ్య, లగిశెట్టి సత్యనారాయణ, కప్పల యాదయ్య, కదారి అనిత, ముసుకు వెంకటయ్య, వేముల శ్రీనివాస్, ముడుదుడ్ల పద్మ, సురగట్టి సునీత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూది కీలక పాత్ర

కేతేపల్లి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో టీఎస్ పీఆర్టీయూ కీలక పాత్ర పోషిస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. సంఘం మండల అధ్యక్షుడు కె.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మమత, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మేకల జానారెడ్డి, సుంకరి భిక్షంగౌడ్, కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, కుశలవరెడ్డి, వేణుగోపాల్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా



కాంగ్రెస్ పార్టీలో చేరినవారితో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా కొనసాగుతుందని, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు గెలిచే అవకాశం ఉండదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని జాన్‌తండాకు చెందిన దాదాపు 50 మంది బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి, రైతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలు లేకుండా క్లీన్‌స్వీప్ చేస్తానన్నారు. కార్యక్రమంలో నాంపల్లి మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, రవినాయక్, జమ్లానాయక్, చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రిగూడను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలి

మర్రిగూడ : మర్రిగూడ మండలాన్ని రంగారెడ్డి జిల్లాతోపాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విలీనం చేయాలని కోరుతూ పలువురు మండల వాసులు మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు రమావత్ ధర్మ నాయక్, జనం కలం సంపాదకులు నల్ల యాదయ్య ఉన్నారు.

మూసీ ప్రాజెక్టుకు 1652 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం ఎగువ నుంచి మూసీకి 1652 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా మంగళవారం సాయంత్రం నీటి మట్టం 642.80 అడుగుల వరకు చేరుకుంది. వానాకాలం పంటల సాగు కోసం మూసీ కుడి కాల్వకు 262 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 306 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

వెంచర్‌లో కల్వర్టు తొలగింపు

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని కామినేని ఆస్పత్రి ఎదురుగా హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి సమీపాన ఇటీవల స్పెక్ట్రా వెంచర్ ఏర్పాటు చేశారు. ఏపీ లింగోటం, మాధవ ఎడవల్లి గ్రామాల మధ్యలోని పెద్ద చెరువు మధ్యలో గల ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 122లో, మాధవ ఎడవల్లి గ్రామంలోని చెరువు కాలువలో కల్వర్టు నిర్మించి వెంచర్ ఏర్పాటు చేయడంతో కల్వర్టును మంగళవారం అధికారులు తొలగించారు. ఆ సమయంలో వెంచర్‌లో పనిచేసేవారు అడ్డుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో కల్వర్టును పూర్తిగా తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్, ఆర్ఐ తరుణ్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



నల్లగొండ టూటౌన్ : దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : దాశరథి శత జయంతి వేడుకలను మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మంగళవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి కృష్ణమాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎం.ఆనంద్, డాక్టర్ సి.అనితకుమారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహాకవి దాశరథి జయంతి వేడుకలను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దాశరథి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.భిక్షమయ్య, ఉపాధ్యాయులు రాపోలు పరమేష్, బి.జానకిరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, కన్నె శివయ్య, శ్రీధర్, మేడం శేఖర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

కేతేపల్లి: ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. కేతేపల్లిలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులు, వాటికి సంబంధించిన రశీదులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులను ఈపాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని ఆదేశించారు. ఎరువుల నిల్వ వివరాలను ప్రతిరోజు దుకాణం ఎదుట బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా యూరియా కొరత తీవ్రంగా ఉందని కేంద్రం నిర్వాహకులు ఆర్డీఓ దృష్టికి తీసుకురావడంతో రైతులు సాగు చేసిన పంటలకు సరిపడా యూరియా సరఫరా చేస్తామని చెప్పారు. ఆర్డీఓ వెంట ఏఈఓ బాలరాజు, కేంద్రం నిర్వాహకులు కొప్పుల ప్రదీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిక్షణ తరగతులకు ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్లు

నల్లగొండ టూటౌన్ : ఎంజీ యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం కేడెట్లు తమ నైపుణ్యాలు మెరుగుపర్చుకునేందుకు 31వ బెటాలియన్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ రాంనగర్‌లో నిర్వహించే 10 రోజుల శిక్షణ కార్యక్రమానికి మంగళవారం వెళ్లారు. పోలీస్ డ్రిల్, వ్యాయామం, విపత్తుల నిర్వహణ, జాతీయభావం , స్వీయ క్రమశిక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందుతారని ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ ముచ్చేందర్ తెలిపారు. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ టి.లక్ష్మారెడ్డి, సుబేదార్ మేజర్ మాధవరావు పర్యవేక్షణలో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి



నల్లగొండ టౌన్ : సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టౌన్ : విద్యార్థులు, యువకులు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహించే సైకిల్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయిని అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా వ్యాప్తంగా సైకిల్‌యాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేకమంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గుండాల నరేష్, పాలాది కార్తీక్, జి.రఘువరన్, కిరణ్, సుక్కార్, తరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

మునుగోడు: యువత గంజాయి, మద్యం, జూదం వంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ని పాడుచేసుకోవద్దని మునుగోడు ఎస్ఐ ఇరుగు రవి సూచించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై చేపట్టిన సైకిల్ యాత్ర పోస్టర్‌ను మంగళవారం మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు యువకులు వ్యసనాలకు అలవాటుపడి బెట్టింగుల్లో డబ్బులు పెట్టి అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి నరేష్, మండల కమిటీ సభ్యులు కమ్మంపాటి రవి, యాదయ్య, సురేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కోటేశ్వర్‌రావు

కట్టంగూర్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి పి.కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాబోయే మూడు నెలలు చాలా కీలకమని, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్వేత, ఎంపీఓ స్వరూపారాణి, ఆశావర్కర్‌లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి



నార్కట్‌పల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

కేతేపల్లి: కేరళ మాజీ సీఎం, సీపీఎం ఆవిర్భావ కమిటీ సభ్యుడు అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం మండల నాయకులు మంగళవారం సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా కేతేపల్లిలోని సీపీఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు కోట లింగయ్య, పుణ్యమూర్తి, లింగయ్య, ఎ.నాగయ్య, బట్టు శ్రీను, భిక్షంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: అచ్యుతానందన్ మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న అన్నారు. నార్కట్‌పల్లిలో మంగళవారం అచ్యుతానందన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కార్యదర్శి చెరుకు పెద్దులు, ఆమనగంటి ఐలయ్య, అర్థం శ్రీను, యనమల సైదులు, ఎనమల్ల ఎల్లయ్య, చెరుకు రాజు, భాజ నరసింహ, ఎండీ మహ్మద్ పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్: పట్టణంలోని వీటీ కాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 42వ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ గుండా వెంకటయ్య, ధర్మకర్తలు బొబ్బిలి శేఖర్‌రెడ్డి, కవితా, కైరంకోడ వెంకటేశ్వర్లు, కాసర్ల లక్ష్మీ, పోరెళ్ల ముత్తయ్య, భక్తులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

గట్టుప్పల్ : మండల పరిధిలో బెల్టు షాపులను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నామాపురం, వెల్మకన్నె గ్రామాల్లో బెల్టు షాపులపై దాడులు నిర్వహించి ఇద్దరి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మద్యం సేవించడం వల్ల యువత చెడు దారిన పడుతున్నారని అన్నారు.

పుస్తకాల వితరణ

చండూరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల గ్రంథాలయానికి ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సుధీర్‌బాబు ఏడు వేల రూపాయల విలువ గల పుస్తకాలను ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కట్ట మమతకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు కొల్లం వెంకట్ రెడ్డి, ఎస్కే మజీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

గట్టుప్పల్ : ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు, కార్యాలయాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రొటోకాల్ పాటించాలని ఎంపీడీఓ మాధవరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇటీవల అనుమతులు లేకుండా నాయకులు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని అన్నారు.

25న శిక్షణ తరగతులు

నాంపల్లి: మునుగోడు నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఈ నెల 25న మర్రిగలూడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం నాంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

ప్రచార కరపత్రాలు విడుదల

చిట్యాల: పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్న శ్రావణ మాసోత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను మంగళవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు విడుదల చేశారు. ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, డైరెక్టర్‌లు గంజి వెంకటేశం, బుద్ద విమల కృష్ణమూర్తి, రుద్రారపు లింగయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసే సమయంలో ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీడీపీఓకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి నర్సింహ, కె.విజయలక్ష్మి, పి.సరిత, పాల్గొన్నారు.

కుర్చీలు బహూకరణ

నాంపల్లి: మండలంలోని గానుగుపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్ఆర్ఐ డాక్టర్ వనమాల నాగేంద్రబాబు తన తండ్రి స్మారకార్థం మంగళవారం కుర్చీలు, ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నేర్లకంటి కవిత, నేర్లకంటి రవికుమార్, కాటం పెద్దయ్య, వీరమళ్ళ వెంకన్న, కాటం గణేశ్, కాటం రవికుమార్, ఏపూరి ఎల్లయ్య, ఏపూరి భిక్షమయ్య, ఏపూరి రమేష్, ఏపూరి ఎలమ్మ, కాటం స్వాతి, ఆకులపల్లి ముత్తమ్మ, వరికుప్పల లక్ష్మమ్మ, ఏపూరి వజ్రమ్మ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టూటౌన్: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ఆ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను మంగళవారం ఎంజీ యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హన్మాన్, ఛత్రపతి, రాజేష్, సూర్య, వెంకటేష్, ప్రత్యూష, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

శాలిగౌరారం: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు గుజిలాల శేఖర్‌బాబు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారిణి సూర్యశిల్ప, క్లబ్‌ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ తండ్రి మృతి

కట్టంగూర్ : ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు యాదవ్ తండ్రి పరమానందం (85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. పరమానందం మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.